క్లుప్తంగా

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించాలి

మిర్యాలగూడ : ఇంటర్మీడియట్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాలని డీఈఓ బొల్లారం భిక్షపతి అన్నారు. మంగళవారం మండలంలోని తుంగపాడు ఆదర్శ పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు పలు ప్రశ్నలను వేసి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం మాడుగులపల్లి కేజీబీవీ విద్యార్థినులకు భవనాన్ని కేటాయించడానికి శ్రీనివాస్‌నగర్‌లోని ప్రైవేట్ భవనాన్ని పరిశీలించి మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈఓ బాలాజీనాయక్, ప్రిన్సిపాల్ దీన సుజాత, ప్రత్యేకాధికారి పార్వతీ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

దేవరకొండ : అక్రమంగా ఓ ఇంట్లో నిల్వ చేసిన ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. దేవరకొండ మండలం జేత్యతండాకు చెందిన కోట్యానాయక్ ఇంట్లో రేషన్ బియ్యాన్ని నిల్వ చేశారన్న సమాచారం మేరకు మంగళవారం తనిఖీలు చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్న రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవన్నారు.

ప్లాంటేషన్, శానిటేషన్‌పై తనిఖీ

కొండమల్లేపల్లి : మండలంలోని కొత్తబావి గ్రామంలోని శానిటేషన్, ప్లాంటేషన్‌పై మంగళవారం ప్రత్యేక అధికారి సుమానంద్ ఆధ్వర్యంలో అధికారులు సామాజిక తనిఖీ నిర్వహించారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ నిధులతో చేపట్టిన శానిటేషన్, ప్లాంటేషన్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి సుమానంద్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలతో కొత్తబావి గ్రామంలో చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను సేకరించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామపంచాయతీలోని పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ రాంరెడ్డి, ఎంపీఓ సీజే ఎస్. రావు కొండమల్లేపల్లి, కొత్తబావి పంచాయతీ కార్యదర్శులు డాకునాయక్, నర్సింహులు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శిగా అశోక్

తిరుమలగిరి(నాగార్జునసాగర్): బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన వల్లవాయి అశోక్ నియమితులయ్యారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు నియామక పత్రాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అందజేశారు ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ తనను జిల్లా కార్యదర్శిగా ఎంపిక చేసిన జిల్లా పార్టీ అధ్యక్షుడు, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పీఆర్టీయూ అధ్యక్షుడిగా కేతావత్ మూనా



పెద్దఅడిశర్లపల్లి : పీఆర్టీయూ పీఏపల్లి మండల అధ్యక్షుడిగా కేతావత్ మూనా వరుసగా పదోసారి ఎన్నికయ్యారు. మంగళవారం మండల కేంద్రంలో పీఆర్టీయూ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా మంచుకంటి మధు, పరశురాంగౌడ్‌లు వ్యవహరించారు. పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శిగా రెడ్డిమణి అనీల్‌కుమార్, అసోషియేట్ అధ్యక్షుడిగా రాయికంటి సైదులు, మహిళా ఉపాధ్యక్షురాలిగా తీగల శ్రీవిద్య, కార్యదర్శులుగా శ్రీనివాస్‌రెడ్డి, హుస్సేన్, నోముల నగేష్, మహిళా కార్యదర్శిగా పోదూరి మణేమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి నారాయణరెడ్డి,రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షుడు చందర్‌నాయక్,జిల్లా అసోషియేట్ అధ్యక్షుడుతరాల పరమేష్, తిరుమలరావు, మోతాలాల్, మంగ ఉన్నారు.

శాంతియుతంగా ఉత్సవాలు జరుపుకోవాలి

పెద్దఅడిశర్లపల్లి : గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు నిబంధనలు పాటించి శాంతియుత వాతావరణలో గణేశ్ ఉత్సవాలను జరుపుకోవాలని గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు అన్నారు. మంగళవారం మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద గల గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన శాంతిసంఘం సమావేశంలో నిర్వాహకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గణేశ్ ఉత్సవ కమిటీలు గణేశ్ మండప ఏర్పాటుకు ముందస్తుగా ఆన్‌లైన్‌లో అనుమతి తీసుకోవాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

వేములపల్లి : ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సీహెచ్ఓ చంద్రప్రకాశ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన వైద్య శిబిరంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మాట్లాడారు. నీటి నిల్వ వల్ల దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు ప్రబలుతాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సోమాచారి, ఏఎన్ఎం శైలజ, కార్యదర్శి పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువైద్యశాల

- పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన భవనం
- వర్షం వస్తే ఉండలేని పరిస్థితి
- నూతన భవనం నిర్మించాలని కోరుతున్న సిబ్బంది



పెచ్చులూడిన పశువైద్యశాల భవనం



పిల్లర్ల దశలోనే నిలిచిపోయిన స్టోర్ రూం

పెద్దఅడిశర్లపల్లి : పీఏపల్లి మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు కూలుతుందోనని బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సి వస్తోందని అందులో పని చేస్తున్న సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన భవనం నిర్మించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నా స్పందించడం లేదని వాపోతున్నారు. మండల కేంద్రంలో ఉన్న పశువైద్య కేంద్రం నిర్మించి ఏళ్లు గడుస్తుండడంతో పైకప్పు పెచ్చులూడుతోంది. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి పెచ్చులూడి పడుతుండటంతోపాటు వర్షపు నీరు భవనంలోకి వచ్చి చేరుతోంది. విధులు నిర్వహించాలంటేనే భయపడాల్సి వస్తుందని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువులకు వైద్య పరీక్షలు చేయించేందుకు ఎంతో మంది పెంపకందారులు ఇక్కడికి వస్తుంటారు. ఇక్కడ సరైన వసతులు లేకపోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది.

కనీస వసతులు కరువు

మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో కనీస వసతులు లేకపోవడంతో ఇందులో పని చేస్తున్న సిబ్బందితో పాటు పశువైద్యం కోసం వచ్చే వారు సైతం ఇబ్బందులు పడక తప్పడం లేదు. పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన భవనంలో ఉండేందుకు సిబ్బంది జంకుతున్నారు. కనీసం నీటి వసతి కూడా లేదని, మూత్రశాలలు కరువవ్వడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కొత్త భవనం మంజూరు చేసి సమస్యలు పరిష్కరించాలని సిబ్బంది కోరుతున్నారు.

పిల్లర్ల దశలోనే నిలిచిన నిర్మాణం

మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో స్టోర్ రూం కోసం 13ఏళ్ల కిందట రూ.2లక్షల వ్యయంతో చేపట్టిన నిర్మాణం పిల్లర్ల దశలోనే నిలిచిపోయింది. ఏ కారణాలతో పనులు నిలిపేశారో తెలియని పరిస్థితి. పశువైద్య కేంద్రానికి వచ్చే పరికరాలు, మందులను ఉంచేందుకు కూడా సరైన గది లేదని సిబ్బంది పేర్కొంటున్నారు. పిల్లర్ల దశలో నిలిపేసిన స్టోర్ రూం నిర్మాణంతో పాటు నూతన భవనం త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

వైద్యశాలలోకి వర్షపు నీరు వస్తుంది



భవనం పాతపడింది. వర్షానికి స్లాబ్ పెచ్చులూడుతున్నాయి. ఇక్కడ విధులు నిర్వహించాలంటనే భయమేస్తోంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన పడాల్సి వస్తుంది. కురుస్తున్న వర్షాలకు నీరు వైద్యశాలలోపలికి వస్తుంది.

– నరేష్, వెటర్నరి అసిస్టెంట్

కొత్త భవనం నిర్మించాలి



శిథిలావస్థకు చేరిన భవనం స్థానంలో కొత్త భవనం నిర్మించాలి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విధులు నిర్వహించాల్సి వస్తుంది. కొత్త భవనం నిర్మించడంతో పాటు కనీస వసతులు కల్పించాలి. స్టోర్‌రూం లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

– మహేందర్‌రెడ్డి, వైద్యాధికారి, పెద్దఅడిశర్లపల్లి

కరాటే పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలో ఈనెల 29న నిర్వహించనున్న జాతీయ స్థాయి అండ్ కుంగ్ ఫూ పోటీల ప్రచార పోస్టర్‌ను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మిరక్యాలగూడలో జాతీయ స్థాయిలో కరాటే, కుంపు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆర్గనైజింగ్ ఫౌండర్ అండ్ టెక్నికల్ డైరెక్టర్ బూడిద సైదులు మాట్లాడుతూ మిర్యాలగూడలో నిర్వహించే 22వ జాతీయ స్థాయి కరాటే, కుంపు పోటీలకు వేయి మంది క్రీడాకారులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు కౌన్సిలర్ దేశిడి శేఖర్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, చీఫ్ ఆర్గనైజర్ రామకృష్ణానాయక్ తదితరులున్నారు.

4వేల మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తాం

- మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్

మిర్యాలగూడ టౌన్ : వినాయక చవితి సందర్భంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అన్ని వార్డులకు 4వేల విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ తెలిపారు. మంగళవారం ఆయన ఛాంబర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉత్సవ కమిటీ సభ్యులు తప్పని సరిగా ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యుత్, పోలీస్ అనుమతులు తీసుకోవాలన్నారు. అదే విధంగా ప్రతి మండపంలో సౌండ్‌ను ఎక్కువ పెంచి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండాలని, కేవలం భక్తి పాటలు మాత్రమే వేయాలన్నారు. 10గంటల తరువాత మైక్‌లను వాడవద్దన్నారు. అందరూ ఐక్యమత్యంతోనే ఈ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. మండపాల సమీపంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మున్సిపాలిటీలో దోమలకు మ్యాట్ ఎంతమంది ఉపయోగిస్తున్నారనే విషయంపై మెప్మా ఆర్‌పీలతో ఇంటింటి సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఫీవర్ సర్వే ఇంటింటికి ముమ్మరంగా సాగుతుందన్నారు. దోమల నియంత్రణకు మురుగు గుంతల్లో నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్‌లను వేయనున్నట్లు తెలిపారు.

వినాయక విగ్రహాల పరిశీలన

మిర్యాలగూడ టౌన్ : కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ వినాయక విగ్రహ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం వాటి ధరల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణలతో సిబ్బంది ఉన్నారు.

చిన్నారులకు అర్థమయ్యే రీతిలో వివరించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ మమత

మిర్యాలగూడ టౌన్ : ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ పిల్లలకు అర్థమయ్యేరీతిలో కథలను వివరించాలని టీచర్లకు మిర్యాలగూడ అర్బన్ సీడీపీఓ రేఖ మమత సూచించింది. మంగళవారం పట్టణంలోని ఇస్లాంపుర సెక్టార్ పరిధిలోని సుభాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ పిల్లలకు బుక్‌లోని కథల పుస్తకాల గురించి వివరించారు. ఆసక్తికరంగా ఉన్న బొమ్మలను కథలను చిన్నారులకు ఇచ్చి బొమ్మలను చూపించాలన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజీయాబేగం, అంగన్‌వాడీ టీచర్లు చిన్నమ్మ, నర్మద, లత, ఏఎన్ఎం భాగ్యమ్మ, ఆశవర్కర్ అనిత, గర్భిణులు. బాలింతలు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల గోడు వినని ప్రభుత్వం



పోరు యాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

దేవరకొండ : సంక్షేమ హాస్టల్ విద్యార్థుల గోడు రాష్ట్ర ప్రభుత్వం వినడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్‌లు అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన మోటార్ సైకిల్ యాత్ర మంగళవారం దేవరకొండ చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయిన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు లక్ష్మణ్‌నాయక్, బుడిగ వెంకటేష్, కావ్య, సైదానాయక్, రమేష్, స్పందన, పావని, జగన్‌నాయక్ పాల్గొన్నారు.

మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలి

కొండమల్లేపల్లి : పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చండూరులో చేపట్టిన మోటార్ సైకిల్ పోరు యాత్ర మంగళవారం కొండమల్లేపల్లికి చేరుకుంది. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహిళా కోకన్వీనర్ కుంచం కావ్య, రమావత్ లక్ష్మణ్‌నాయక్, సైదా, వెంకటేష్, కోరే రమేష్, ముస్కు రవీందర్, జగన్, వీరన్న, సాయి,పావని, మౌనిక, స్పందన, రవి, కిరణ్, సంపత్, నవదీప్, ప్రవీణ్, పాల్గొన్నారు.

నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందేలా కృషి

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



నక్కలగండి ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్, తదితరులు



డిండి : ప్రాజెక్టు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యేలు బాలునాయక్, వంశీకృష్ణ

చందంపేట : నక్కలగండి ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురవుతున్న నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందేలా తనవంతు కృషి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా నక్కలగండి వెనుక జలాలు నిండి నక్కలగండి తండాలోని ఇళ్లలోకి, సమీప పొలాలోకి వర్షపు నీరు చేరడంతో రైతులు పంట నష్టపోయారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో రైతుల పంటలను పరిశీలించడంతో పాటు నక్కలగండి ప్రాజెక్టును ఎమ్మెల్యే పరిశీలించారు. నష్టపోయిన పంటల వివరాలను సేకరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అనంతరం చందంపేట, నేరెడుగొమ్ము మండలాల్లోని చెరువులను నింపేందుకు డిండి ప్రాజెక్టు నీళ్లను కామేపల్లి వద్ద తూము ద్వారా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు, తహసీల్దార్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు పార్వతీచందునాయక్, ముత్యాలు సర్వయ్య, గోవిందుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలంయాదవ్, మాజీ జెడ్పీటీసీలు బుజ్జి లచ్చిరాం నాయక్, మండల పార్టీ నాయకులు బద్యానాయక్, హరికృష్ణ, దొంతినేని వెంకటేశ్వర్‌రావు, ముక్కమల వెంకటయ్యగౌడ్, భరత్, వెంకటయ్య, పచ్చిపాల కృష్ణయ్య, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

డిండి : రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు మండల కేంద్రంలోని డిండి ప్రాజెక్ట్ అలుగు పోస్తుండటంతో మంగళవారం ఆ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన జలహారతి, పూజాకార్యక్రమానికి అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతి రైతుకు రూ.2లక్షల వరకు రుణమాఫీని వర్తింపజేయడంతో పాటు రైతుభరోసాను త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నింటిని రానున్న రెండున్నరేళ్ల వ్యవధిలో పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరందించే విధుంగా సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీను. సాయికుమార్, రేఖ్యానాయక్, బీముడు నాయక్, శ్రీనివాస్‌గౌడ్, కాశన్న, లక్ష్మణ్, శిధర్‌రెడ్డి, దామోదర్‌రావు, వెంకటేష్, ఖలీం, రహీం పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : బాధితుల పాలిట సీఎం రిలీఫ్ ఫండ్ వరమని ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన 72 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.18,96,500 విలువగల చెక్కులను మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుతో కలిసి ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆపదలో ఉన్న నిరుపేదల వైద్యఖర్చు కోసం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, చిట్టిబాబునాయక్, వీరకోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుట్టపైనుంచి పడి మేకల కాపరి మృతి

చందంపేట : ప్రమాదవశాత్తు గుట్టపై నుంచి కాలు జారిపడి మేకల కాపరి మృతి చెందిన ఘటన మండలంలోని పాత తెల్దేవర్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఆ గ్రామానికి మాన్యం నిరంజన్(45) పది రోజుల క్రితం తన మేకలను మేత కోసం అచ్చంపేట మండలంలోని ఘనపురం అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. పది రోజులుగా అక్కడే తన మేకలను మేపుకుంటూ ఉంటున్నాడు. ఈ క్రమంలోనే మేకల గుంపు తప్పి పోవడంతో ఆచూకీ కోసం అక్కడ ఉన్న గుట్టను ఎక్కే ప్రయత్నం చేయగా కాలు జారి కిందపడిపోవడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. నిరంజన్ ఎంతకీ ఫోన్ లిఫ్టు చేయకపోవడంతో మంగళవారం తెల్లవారుజామున బంధువుల అక్కడికి వెళ్లి చూడగా నిరంజన్ విగత జీవిగా పడి ఉన్నాడు. మంగళవారం సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే బాలు నాయక్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడికి భార్య,కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కొండ చిలువ హతం



కొండచిలువను చూపుతున్న రైతులు

పెద్దవూర : మండల కేంద్రానికి చెందిన కర్నాటి సత్యనారాయణరెడ్డి తనకున్న బత్తాయి, మామిడి తోటలో పూరి గుడిసెలో తొమ్మిది అడుగుల పొడవైన భారీ కొండ చిలువ చుట్టుచుట్టుకుని పడుకుని ఉంది. దీన్ని గమనించిన రైతు సత్యనారాయణరెడ్డి భయంతో అక్కడినుంచి వెళ్లాడు. తెలిసిన వారికి ఫోన్ చేయగా వారు అక్కడికి రాగా వారిపైకి పెద్దగా శబ్దం చేస్తూ రావడాన్ని గమనించి కర్రలతో కొట్టి చంపారు. రాత్రి ఎప్పుడు వచ్చిందో గాని రెండు కోళ్లను చంపి తినేసి పడుకుంది. ఈ తోటకు ఎదురుగా ఎస్టీ గురుకుల విద్యాలయం ఉంది. నిత్యం తోట పక్కనుంచి ఉన్న రోడ్డుగుండా విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది వెళ్తుంటారు. రాత్రి సమయంలో విద్యాలయంలోకి వెళితే పరిస్థితి ఏంటని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంపులో గల ఇండోర్ స్టేడియంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు బాలబాలికలకు రాష్ట్రస్థాయి బాడ్మింటన్ పోటీలు(అండర్–11) నిర్వహించనున్నట్లు నల్లగొండ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి రంగారావు తెలిపారు. మంగళవారం ఇండోర్ స్టేడియంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులకు హాజరవుతారని పేర్కొన్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఈ పోటీల ఆర్గనైజింగ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ అంజయ్య, మిర్యాలగూడ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, జిల్లా బ్యాడ్మింటన్ కోచ్ ఎం. రామకృష్ణ, శ్రీకాంత్ తదితరులున్నారు.

కేజీబీవీ విద్యార్థులను తరలించాలని ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంఈఓ బాలాజీనాయక్

వేములపల్లి : తమ హాస్టల్‌కు తమకు మాత్రమే కేటాయించాలని, ఇక్కడ ఉంటున్న కేజీబీవీ విద్యార్థినులను వేరో చోటుకు తరలించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థినులు మంగళవారం పాఠశాల గేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ వంద మంది ఉండాల్సిన హాస్టల్‌లో సుమారు 350మంది విద్యార్థినులు ఉంచడంతో తాము కాలకృత్యాలు తీర్చుకుందామన్నా, నిద్రించాలన్నా తీవ్ర ఇబ్బందులకు గురవుతామన్నారు. గతంలో ధర్నా చేపట్టడంతో అధికారులు గత నెల 15 వ తేదీ తరువాత కేజీబీవీ విద్యార్థినులను తరలిస్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చినప్పటికి ఇంతవరకు తరలించకపోవడమేంటని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ బాలాజీ నాయక్ అక్కడికి చేరుకోని విద్యార్థినులతో మాట్లాడి సర్ధిచెప్పినప్పటికీ విద్యార్థినులు వినలేదు. సుమారు మూడు గంటల పాటు విద్యార్థినులు ఆందోళన చేపట్టడంతో పాఠశాలకు వచ్చే విద్యార్థినులు భయటే ఉండిపోయి స్థానికంగా ఉన్న తహసీల్దార్ కార్యాలయం వద్ద వేచి ఉన్నారు. ఉపాధ్యాయులు రోడ్డుపైనే పడిగాపులు కాయాల్సి వచ్చింది. మరికొందరు విద్యార్థినులు తిరిగి తమ ఇళ్లకు వెళ్లిపోయారు.

మహిళపై అత్యాచారం!

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని ఓ కాలనీలో మహిళపై ముగ్గురు యువకులు మంగళవారం అత్యాచారానికి పాల్పడినట్లు సమాచారం. అయితే ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది. ఈ విషయమై వన్‌టౌన్ పోలీసులను వివరణ కోరగా మహిళపై అత్యాచారం జరిగినట్లు తమ దృష్టికి రాలేదని, బాధితులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు పేర్కొన్నారు.

నాయబ్ తహసీల్దార్‌కు ప్రమోషన్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండల నాయబ్ తహసీల్దార్ బుసిరెడ్డి రామకృష్ణారెడ్డికి తహసీల్దార్‌గా ప్రమోషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ లో రామకృష్ణారెడ్డి రిపోర్ట్ చేయాలని సూచించింది. ఇంకా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.

కొనసాగుతున్న రుణమాఫీ సర్వే

హాలియా : మండలంలో వ్యవసాయ అధికారి సరిత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రుణమాఫీ సర్వే కొనసాగుతోంది. మంగళవారం అనుముల మండలంలోని కొరివేనిగూడెం, పేరూర్ గ్రామాల్లో రుణమాఫీ కాని రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కుటుంబ సభ్యులతో సెల్ఫీ దిగి రైతు భరోసా పంట రుణమాఫీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు.

అధిక ధరలకు మందులు అమ్మితే కఠిన చర్యలు



పత్తిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

అడవిదేవులపల్లి : ఎరువులు, విత్తనాలు, మందులు ప్రభుత్వ ధరలకు మాత్రమే అమ్మాలని, అధిక ధరలకు అమ్మితే వారిపై కఠిన చర్యలు తప్పవని మిర్యాలగూడ వ్యవసాయ సహాయ సంచాలకులు దేవ్‌సింగ్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ నిర్వహించి పత్తి చేలను పరిశీలించిన అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం భారీ వర్షాల తరువాత పత్తి, వరి పంటలో ఉన్న మురుగునీరును కూడా పరిశీలించారు. ఎకరానికి 25కేజీల నుంచి 30కేజీల యూరియా, 10నుంచి 15కేజీల ఎంఓపీ ఎరువులను అదనంగా వేయాలన్నారు. వర్షాలు తగ్గిన తరువాత పోటాషియం, నైట్రిజన్ 2శాతం, సోల్యూషన్ 7 నుంచి 10 రోజుల వ్యవధిలో రెండు, మూడు సార్లు పిచికారి చేయాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయశాఖ అధికారిని గుర్రం సరిత, ఏఈఓలు మహేష్‌నాయక్, నరేష్‌లతో తదితరులున్నారు.

కేజీబీవీని సందర్శించిన ఎంపీడీఓ



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని కస్తూరీబా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం ఎంపీడీఓ కరుణాకర్‌రావు, వైద్యాధికారి సయ్యద్ అజాద్‌లు సందర్శించారు. అనంతరం విద్యాలయంలో వంట గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మోహిసిన్ బిన్ అహ్మద్, డాక్టరు రామాంజనేయులు, పీఓ రవికుమార్ తదితరులున్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి

కొండమల్లేపల్లి: పని నిమిత్తం కాటన్ మిల్లుకు వెళ్లిన వ్యక్తిపై విద్యుత్ తీగలు పడడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండలం చిన్నఅడిశర్లపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నఅడిశర్లపల్లి గ్రామానికి చెందిన రావుల వెంకటయ్య(55) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య అలివేలు, కుమారుడు రమేష్, కుమార్తె అనిత ఉన్నారు. వెంకటయ్య మంగళవారం గ్రామంలోని కాటన్ మిల్లు వద్దకు పని నిమిత్తం వెళ్లాడు. అప్పటికే మిల్లులో పనిచేసే కార్మికులు ఉండే గదిలో విద్యుత్ మరమ్మతు పనులు జరుగుతుండగా అటువైపు వెళ్తున్న వెంకటయ్య ఛాతిపై విద్యుత్ తీగలు పడడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మిల్లు యజమాని నిర్లక్ష్యం కారణంగా వెంకటయ్య మృతిచెందాడని ఆరోపిస్తూ మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మిల్లులోనే వెంకటయ్య మృతదేహాన్ని ఉంచి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్య, కొండమల్లేపల్లి, పీఏపల్లి ఎస్ఐలు రామ్మూర్తి, నర్సింహులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రభుత్వ పరంగా న్యాయం జరిగేలా చూస్తామని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ మిల్లు యజమాని వచ్చి తమకు న్యాయం చేసేంత వరకు అక్కడి నుంచి కదిలేది లేదని మృతుడి బంధువులు, గ్రామస్తులు భీష్మించుకు కూర్చున్నారు. దీంతో చేసేదేమీ లేక పోలీసులు మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. మిల్లు యజమానితో చర్చిస్తున్నట్లు సమాచారం.

మిర్యాలగూడలో యువకుడు..

మిర్యాలగూడ : విద్యుత్ స్తంభాలు వేస్తున్న క్రమంలో ప్రమాదశాత్తు విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతిచెందిన సంఘటన దామరచర్ల మండలంలోని కొండ్రపోల్ గ్రామశివారులో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వీర్లపాలెం గ్రామానికి చెందిన పాతులోతు హాతిరాం (25) విద్యుత్ స్తంభాలను వేసే కాంట్రాక్టర్ వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం కొండ్రపోల్ గ్రామంలో విద్యుత్ స్తంభాలను గుంతలో పెట్టి పైకి లేపుతున్న క్రమంలో పైన ఉన్న 11కేవీ విద్యుత్ వైర్ స్తంభానికి తాకడంతో ఒక్కసారిగా స్తంభాన్ని వేస్తున్న హాతిరాం విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి వెళ్లాడు. వెంటనే స్థానికులు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య అఖిల, ఒక పాప, బాలుడు ఉన్నారు. మృతదేహాన్ని మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించి మృతుడి భార్య అఖిల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వాడపల్లి పోలీసులు తెలిపారు.